రేటు.. ఘాటు!



కిలో వెల్లుల్లి రూ.400, అల్లం రూ.200

- భారీగా పెరిగిన అల్లం, వెల్లుల్లి ధరలు
- అధిక వర్షాలతో నీట మునిగి తగ్గిన దిగుబడి
- తక్కువ మొత్తంతో నెలంతా సరిపెట్టుకుంటున్న గృహిణులు
- రంగంలోకి నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ముఠాలు

ధరల పెరుగుదలకేదీ అనర్హం కాదన్న చందంగా రోజురోజుకూ అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. చికెన్, కోడిగుడ్లు, ఉల్లి, టమాట ఇలా వివిధ సందర్భాల్లో నాన్‌వెజ్, వెజ్ వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా అల్లం వెల్లుల్లి ధరలు ఒక్కసారిగా మూడింతలు పెరిగాయి. కూర ఏదైనా రుచి రావాలంటే సహజసిద్ధ సుగంధ ద్రవ్యాలైన అల్లం వెల్లుల్లి ఉండాల్సిందే. ఇళ్లలో అయినా, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు వంటి వాణిజ్య కేంద్రాల్లోనూ ఆహార పదార్థాల్లో అల్లం వెల్లుల్లిని తప్పక వాడతారు. పోయిన వాన కాలంలో కొన్నిచోట్ల భారీ వర్షాలతో పంట నీటమునిగి కుళ్లిపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాల్లేక పంటనే వేయకపోవడంతో ఉత్పత్తి పడిపోయింది. మార్కెట్లో నిల్వలు నిండుకున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.200లోపు ఉన్న వెల్లుల్లి ధర నేడు 400కు చేరింది. మన రాష్ట్రంలో దిగుబడి బాగా పడిపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.



చేవెళ్లలో అల్లం వెల్లుల్లి అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11): అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయకుంటే కూరలు రుచిగా ఉండవు. పేద, ధనిక, ఇళ్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఇలా ఎక్కడ చూసినా వంటకాల్లో తప్పకుండా వెల్లుల్లి పేస్ట్ వాడతారు. కాగా ఉత్పత్తి పడిపోవడంతో అల్లం వెల్లుల్లి ధరలు అమాంతం పెరిగాయి. మార్కెట్లో వాటి నిల్వలు తగ్గాయి. వారం పది రోజులుగా అల్లం వెల్లుల్లి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. నెల క్రితం కిలో రూ.200 ఉన్న వెల్లుల్లి నేడు రూ.400కు పెరిగింది. అలాగే అల్లం కిలో నెల క్రితం రూ.100 ఉండగా ఇప్పుడు రూ.200కు చేరింది. ధర ఎంత పెరిగినా కూరల్లో వాటిని తప్పక వేయాల్సి ఉండడంతో నెలకు కిలో కొనే వారు ఇప్పుడు పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. కాగా భారీ వర్షాలతో అల్లం, వెల్లుల్లి పంట నీట మునగడం, మార్కెట్లకు సరుకు రాక బాగా తగ్గడం, పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి మందగించడం.. దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం తదితర కారణాల వల్లే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట మార్కెట్‌కు రావాలంటే మరింత సమయం పడుతుంది. అదీగాక పాత పంటనే ప్రజలు ఎక్కువ కొంటారు. మహారాష్ట్రలోని నాసిక్, పూణె ప్రాంతాల్లో గతంలో భారీ వర్షాలతో వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. మనకు గుజరాత్,మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి అల్లం వెల్లుల్లి ఎక్కువ దిగుమతి అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. మరో నెల పాటు ఇవే ధరలు కొనసాగొచ్చని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లయిన ఉస్మాన్‌గంజ్, మలక్‌పేటలకు సైతం అల్లం వెల్లుల్లి రాకా బాగా తగ్గింది. నేరుగా రైతులు అమ్మే రైతు బజార్లలోనూ రేటు భారీగానే ఉంది.

పడిపోయిన ఉత్పత్తి

డిమాండ్‌కు సరిపడా అల్లం వెల్లుల్లి ఉత్పత్తి కావడం లేదు. హైదరాబాద్‌కు ఎక్కువగా జహీరాబాద్, కోహీర్, వికారాబాద్, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి అల్లం, వెల్లుల్లి ఎక్కువగా వస్తుంటుంది. ఉమ్మడి జిల్లాలో రోజుకు 50టన్నుల వరకు అల్లం, వెల్లుల్లి అమ్ముడవుతుంది. కానీ ప్రస్తుతం 20టన్నుల నుంచి 30టన్నుల వరకే దిగుమతి అవుతోందని, దీంతో కొరత ఏర్పడి ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. దిగుమతి అవుతున్న సరుకు కూడా వేరే రాష్ట్రాల నుంచే వస్తోందని, పొరుగు జిల్లాల్లోనూ ఉత్పత్తి పడిపోయిందని వ్యాపారులు, టోకు వర్తకులు చెబుతున్నారు. దూర ప్రాంతాల నుంచి దిగుమతి వల్ల కూడా ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఎక్కువై ధర పెరిగిందని వారు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లోకి నకిలీ మాల్!

అల్లం వెల్లుల్లి ధర పెరగడంతో మార్కెట్‌లో నకిలీ మాల్ ఎక్కువైంది. తక్కువ ధరకే అల్లంవెల్లుల్లి పేస్ట్ అంటూ ముఠాలు నకిలీ మాల్‌ను మార్కెట్‌లోకి వదుల్తున్నాయి. కిరాణా దుకాణాల్లో నకిలీ సరుకును అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పుడున్న రేట్లతో పోల్చితే తక్కువ ధరకే అల్లం వెల్లుల్లి పేస్ట్ అమ్ముతుండడంతో పేద, మధ్య తరగతి వారు వాటిని కొంటున్నారు. కెమికల్స్‌తో కూడిన నకిలీ సరుకుతో ప్రాణాలకు ముప్పు అని, స్వచ్ఛమైన అల్లం వెల్లుల్లి కొనలేని వారు అది వేయకున్నా సరే కూరలు వండుకోవచ్చని డాక్టర్లు ప్రజలకు సూచిస్తున్నారు.

పావుకిలోతో నెలంతా సరిపెట్టుకుంటున్నా



రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. వెయ్యి రూపాయలు పెడితే వారం మందం సరుకులకే వస్తున్నాయి. అల్లం ఎల్లిగడ్డ రేటు గతంలో ఎప్పుడూ లేనంత పెరిగింది. నెలకు కిలో కొనేదాన్ని. ఇప్పుడు రేటు రూ.600కు పెరగడంతో పావుకిలోతో సరిపెడుతున్నా.

- వి.లక్ష్మి, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

ధరలు మండిపోతున్నాయి



అల్లమెల్లిగడ్డ ధర ఇంత ఎక్కువ ఉండడం నా జీవితంలో ఎప్పుడూ చూడలే. 50-70 రూపాయలు పెడితే కిలో అల్లంవెల్లుల్లి వొచ్చేది. నెల రోజులుగా ప్రతీ వారం ధర పెరుగుతూనే ఉంది. ధరను ప్రభుత్వం నియంత్రించడం లేదు. ఓ వైపు బియ్యం ధరా పెరిగింది. రూ.600 కిలో అల్లమెల్లిగడ్డ కొనేబదులు అదే డబ్బుతో వారానికి సరిపడా కూరగాయలు వస్తాయి. అల్లమెల్లి లేకుండానే కూరలు వండుతా.

- నడికుడ లావణ్య, షాద్‌నగర్

ఇంత రేట్లు ఎప్పుడూ లేవు



నేను 30ఏళ్ల నుంచి అల్లం వెల్లుల్లి వ్యాపారం చేస్తున్నా. ప్రతీ గురువారం చేవెళ్ల, సోమవారం మొయినాబాద్, శుక్రవారం బాల్‌నగర్‌లో అల్లమెల్లిగడ్డ అమ్ముతా. మలక్‌పేట్, ఉస్మాన్‌గంజ్‌ల నుంచి సరుకు తెస్తా. కిలో వెల్లుల్లి రూ.400, అల్లం రూ.200 చొప్పున అమ్ముతున్నా. గతంలో అల్లం ఎల్లిగడ్డ రేట్లు ఇంతగా ఎప్పుడూ లేవు.

- పాండు, అల్లంవెల్లుల్లి వ్యాపారి, సర్దార్‌నగర్, షాబాద్ మండలం

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

శంషాబాద్, ఫిబ్రవరి 11 : శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండ గ్రామం నుంచి శంషాబాద్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని దొంగచాటుగా తరలిస్తున్నట్టు ఎస్వోటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వారు దాడి నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్య తరలిస్తున్న ఇద్దరు నిందితులను, పట్టుబడిన బియ్యాన్ని శంషాబాద్ రూరల్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

14 మంది ఎంపీడీవోల బదిలీ

రంగారెడ్డి అర్బన్, జనవరి 11 : రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అధికారుల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల భారీ ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరపగా తాజాగా ఎంపీడీవోల బదిలీలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 395మంది ఎంపీడీవోలను ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం బదిలీ చేసింది. సొంత జిల్లాలో పనిచేస్తున్న వారితో పాటు మూడేళ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని డిసెంబరులో ఎన్నికల సంఘం(ఈసీ) ఆదేశించింది. ఈసీ మార్గదర్శకాల మేరకు వివిధ శాఖలు బదిలీలు చేపట్టాయి. జిల్లా పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 14మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. అందులో 8 మంది వికారాబాద్ జిల్లాకు, ఇద్దరు మేడ్చల్-మల్కాజిరి జిల్లాకు బదిలీ కాగా మరో ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఒకరు నాగర్‌కర్నూల్, మరొకరు యాదాద్రి భువనగిరి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న బి.నర్సింహులు, జి.విజయలక్ష్మి, జి.హరీ‌ష్‌కుమార్ కె.వినయ్‌కుమార్, కె.రామకృష్ణ, జె.రాఘవులు, సి.అనురాధ, మహే‌ష్‌బాబు వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. ఎస్.వెంకట్రాములు నాగర్‌కర్నూల్‌కు, డి.శరత్‌చంద్రబాబు, పి.బాల్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. సీహెచ్.శ్రీనివాస్ యాదాద్రి భువనగిరి బదిలీ కాగా జి.వసంత లక్ష్మి, మమతాబాయి మేడ్చల్ జిల్లాకు ట్రాన్స్‌ఫరయ్యారు. వీరంతా ఈ నెల 12న రిలీవ్ కానున్నారు. ఈ నెల 13న కొత్త స్థానంలో పోస్టింగ్ తీసుకోవాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

మరకత శివలింగాన్ని దర్శించుకోవడం అదృష్టం



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న హరీష్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 11: మహిమాన్విత మరకత శివలింగాన్ని దర్శించుకోవడం తన అదృష్టం అని సినీ నటుడు హరీష్ అన్నారు. ఆదివారం చందిప్పలోని ఆకుపచ్చ మరకత శివలింగాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 11వ శతాబ్దంలో చాణుక్యులు ప్రతిష్ఠించిన ఈ శివలింగానికి పూజలు చేయడం తన అదృష్టం అన్నారు. ఆయనతో ఆలయ చైర్మన్ సదానందం, నాయకులు దయాకర్‌రాజు, భూపాల్, సాయి ఉన్నారు.

కొత్త చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించాలి



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న రైతులు

ఆదిభట్ల, ఫిబ్రవరి 11 : ఆదిభట్ల మునిసిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లో గల కొత్త చెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారించాలని రైతులు ఆదివారం నుంచి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కొంగరకలాన్‌లోని సర్వేనంబర్ 338/ఎ, 338/బిలో 20.19ఎకరాల్లో చెరువు ఉందని, చెరువు భూమి అన్యాక్రాంతమైందని తెలిపారు. రెవెన్యూ, నీటి పారుదల అధికారులు సర్వేచేసి హద్దురాళ్లు పాతాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల అధ్యయనం కోసమే ..
న్యాయ్ యాత్ర

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

కొత్తూర్, ఫిబ్రవరి 11 : రాహుల్‌గాంధీ చేపడుతున్న న్యాయ్ యాత్రకు సంఘీభావంగా మహబూనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో తాను 'పాలమూరు న్యాయ్ యాత్ర' చేపడుతున్నామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తూర్ మండలం సిద్దాపూర్‌లో ఆదివారం వంశీచంద్‌రెడ్డి న్యాయ్ యాత్రను షాద్‌నగర్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కె.నారాయణరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. సిద్దాపూర్, ఎస్‌బీపల్లి, కొడిచర్ల, పెంజర్ల గ్రామాలు, కొత్తూర్ మున్సిపాలిటీలో కొనసాగింది. కార్నర్ మీటింగ్‌లో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలను నట్టేట ముంచిందని, వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. ప్రజల సొమ్మును ఆ పార్టీ నేతలు దోచుకున్నారని, అందుకే ప్రజలు వారిని తరిమికొట్టారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2నెలల్లోనే ఆరు గ్యారంటీల్లో రెండు నెరవేర్చారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ప్రజా సమస్యలను అధ్యయనం చేసేందుకే పాలమూరు న్యాయ్ యాత్ర చేపట్టానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీలు దేశాల అంజమ్మ, కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు జె.వేణుగోపాల్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, కొత్తూర్, నందిగామ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, నర్సింహ, నాయకులు ప్రభాకర్, కాశీనాథ్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, వి.దేవేందర్, రఘు, బాబర్‌ఖాన్, జె.సుదర్శన్‌గౌడ్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, సిద్ధార్థరెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, శ్రీను, రవికుమార్, నవీన్‌చారి, సురేందర్, రమేష్, బాల్‌రాజ్, సురేష్, సుధాకర్, మాణయ్య పాల్గొన్నారు.

'కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే ప్రజలకు న్యాయం'

నందిగామ: కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వంశీచందర్‌రెడ్డి చేపట్టిన న్యాయ్ యాత్ర మండలంలోని చేగూర్, వెంకమ్మగూడ, వీర్లపల్లి, అప్పారెడ్డిగూడలో కొనసాగి రాత్రికి నందిగామలో కార్నర్ మీటింగ్‌తో ముగిసింది. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమొస్తే డబుల్ ఇంజన్ సర్కార్లతో అభివృద్ధిని పరుగెట్టిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వంశీచందర్‌రెడ్డిని గెలిపిస్తే పాలమూరు జిల్లాకు న్యాయం జరుగుతుందన్నారు. న్యాయ్‌యాత్రలో మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే నందిగామలో క్రికెట్ టోర్నీ విజేతలకు ఎమ్మెల్యే, వంశీచంద్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలు, నాయకులు పాండురంగారెడ్డి, క్రిష్ణ, పురుశోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, శంకరయ్య, బుచ్చయ్య, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎస్‌బీ పల్లిలో పాలమూరు న్యాయ్ యాత్ర నిర్వహిస్తున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాయకులు

కదులుతున్న పీఠాలు

- ఇప్పటికే పదవి కోల్పోయిన ఆదిభట్ల బల్దియా చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు
- 16న విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్న 'పట్నం' మునిసిపల్ చైర్ పర్సన్ స్రవంతి



ఇబ్రహీంపట్నం మునిసిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11: తెలంగాణలో కాంగ్రెస్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానికంగానూ రాజకీయ పరిస్థితులు చకచకా మారుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో పదవుల్లో ఉన్న వారు ఇప్పుడు వాటిని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ల పీఠాలు కదలడానికి వారి స్వయంకృతాపరాధమేనని చెప్పొచ్చు. పుర పాలనలో వారి కుటుంబ సభ్యుల పెత్తనం, పదవుల్లో ఉన్న వారి ఒంటెద్దు పోకడలు కూడా కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు దారి తీశాయనే వాదన విన్పిస్తోంది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆదిభట్ల మున్సిపాలిటీలో కాంగ్రె‌స్‌కు ఆధిక్యం లభించినా కాంగ్రెస్ సభ్యురాలు కొత్త ఆర్థిక బీఆర్ఎ‌స్‌లో చేరడం, ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతుతో ఆమె చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనకు సహకరించడం లేదంటూ ఆమె బీఆర్ఎ‌స్‌కు బై చెప్పి మరోసారి కాంగ్రె‌స్‌లో చేరారు. ఇక్కడా ఆమెకు చుక్కెదురైంది. మున్సిపల్ పాలనలో చైర్‌పర్సన్ కుటుంబ సభ్యుల పెత్తనాన్ని సహించలేకే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సభ్యులంతా ఏకమై చైర్‌పర్సన్ ఆర్థికను గద్దె దించారు. కాగా ఇక్కడి వైస్ చైర్‌పర్సన్ కోరె కళమ్మ బీఆర్ఎస్ అయినప్పటికీ ఆమెపైనా అవిశ్వాసం పెట్టారు. ఇక ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ విషయానికొస్తే చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి ఈ నెల 16న విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్నారు. ఇక్కడ గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎ‌స్‌కు ఆధిక్యం లభించింది. బీఆర్ఎ‌స్‌కు 16, కాంగ్రె‌స్‌కు 6, బీజేపీకి కౌన్సిలర్లు ఉన్నారు. రెండేళ్ల పాలన సాఫీగానే సాగింది. ఆ తర్వాత చైర్‌పర్సన్ కుటుంబీకుల పెత్తనం ఎక్కువైందని అప్పటి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి సొంత పార్టీ కౌన్సిలర్లు ఫిర్యాదులు చేశారు. 2023 మేలో మొదటిసారి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. అప్పట్లో ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ స్రవంతి కాంగ్రె‌స్‌లో చేరారు. ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు భానుబాబు, రమేష్, మంగ సైతం కాంగ్రె‌స్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు పంది శంకరయ్య, మోహన్ నాయక్, నరాల విశాల బీఆర్ఎ‌స్‌లో చేరారు. దీంతో కౌన్సిల్‌లో బీఆర్ఎస్ 15కు, కాంగ్రె‌స్‌కు 7, బీజేపీ ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నట్టుయింది. కాగా ప్రభుత్వ మార్పుతో రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో చోటుచేసుకుంటున్నట్టుగానే ఇబ్రహీంపట్నం పురపాలికలోనూ మార్పులొచ్చాయి. అవిశ్వాసం మరోమారు తెరపైకి వచ్చింది. 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు చైర్ పర్సన్‌పై అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేశారు. ఈ నెల 16న అవిశ్వాసాన వోటింగ్ సమావేశానికి కలెక్టర్ శశాంక ఉత్తర్వులిచ్చారు. మీటింగ్‌కు రావాలని కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే కౌన్సిలర్లు క్యాంప్‌లో ఉన్నారు. ఇక్కడ అవిశ్వాసం నెగ్గితే 9వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ కొంద్రు శ్రీలత చైర్‌పర్సన్ పదవిని అధిష్ఠించే అవకాశాలున్నాయి.



కప్పరి స్రవంతి, ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్

సొసైటీల్లోనూ అవిశ్వాసాల కాక!

అవిశ్వాస తీర్మానాల కాక సొసైటీలకూ పాకింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లపై సైతం డైరెక్టర్లు అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధం అయ్యారు. చైర్మన్ల ఐదేళ్ల కాల పరిమితిలో నాలుగేళ్లు పూర్తి కావస్తోంది. ఉప్పరిగూడ పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లలో ఏడుగురు బీఆర్ఎస్ మద్దతుదారులు, ఆరుగురు కాంగ్రెస్ అనుకూలురు ఉన్నారు. బీఆర్ఎ‌స్‌కు చెందిన టీకుల సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా, క్యామ శంకర్ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. కాగా కాంగ్రెస్, బీఆర్ఎస్ డైరెక్టర్లు ఏకమై చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశాసాన్ని ప్రకటించడంతో డీసీవో ధాత్రిదేవి ఈ నెల 22న విశ్వాస పరీక్షకు హాజరుకావాలంటూ డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. ఈ అవిశ్వాసం నెగ్గితే కాంగ్రె‌స్‌కు చెందిన ఏదుల్ల పాండురంగారెడ్డి చైర్మన్ అయ్యే అవకాశాలున్నాయి. అలాగే బాటసింగారం ప్యాక్స్ చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపైనా డైరెక్టర్లు అవిశ్వాస నోటీసు తీర్మానం కోరారు. 28న అవిశ్వాస సమావేశానికి డీసీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ 13మంది డైరెక్టర్లకు ఒకరు మృతిచెందారు. ఉన్న 12 మందిలో చైర్మన్ సహా బీఆర్ఎ‌స్‌కు ఏగుడురు, కాంగ్రెస్ మద్దతుదారులు ముగ్గురు, స్వతంత్రులు ఇద్దరు ఉన్నారు. 9మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. అవిశ్వాసం నెగ్గితే బీఆర్ఎ‌స్‌కు చెందిన చేగూరి భరత్ చైర్మన్ అయ్యే అవకాశం ఉంది. వీరంతా క్యాంప్‌లో ఉన్నారు.

అయోధ్యకు బయల్దేరిన రామభక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 11 : శ్రీరామ జన్మభూమి అయోధ్య యాత్రకు చేవెళ్ల నుంచి భారీ సంఖ్యలో రామభక్తులు ఆదివారం బస్సులో బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రామభక్తులు పూజలు చేశారు. అనంతరం బస్సులో జై శ్రీరామ్ నినాదాలతో అయోధ్యకు తరలారు. ఇదిలా ఉంటే అయోధ్యకు వెళ్తున్న భక్తులకు బీజేపీ నాయకులు కాషాయ కండువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చేవెళ్ల నుంచి ప్రత్యేక బస్సులో అయోధ్యకు వెళ్తున్న రామభక్తులు

అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో యువకుడికి బంగారు పతకం



స్పీకర్ ప్రసాద్‌కుమార్ నుంచి పతకాన్ని అందుకుంటున్న మహేశ్

తలకొండపల్లి, ఫిబ్రవరి 11 : అంతర్జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో మండలంలోని గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ మహేశ్ ప్రతిభ కనబర్చాడు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం మాస్టర్ అమర్‌సింగ్ ఈ పోటీలను నిర్వహించగా.. మహేశ్ కేశవ్ కరాటే అకాడమి ఇన్‌స్ట్రక్టర్ మహేశ్ సీనియర్స్ విభాగంలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. పోటీల అనంతరం జరిగిన ఓ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా ఆయన బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. కరాటే పోటీల్లో సత్తాచాటిన మహేశ్‌ను ఈ సందర్భంగా స్పీకర్, పలువురు అభినందించారు. తెలంగాణ సీనియర్ కరాటే మాస్టర్ కేశవ్‌గౌడ్, శ్రీనివాస్, సాయి, యాదవ్, పద్మశేఖర్ పాల్గొన్నారు.

మత రాజకీయాలతో దేశానికి నష్టం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకుడు జంగయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 11 : మత రాజకీయాలు దేశానికి నష్టం కలిగిస్తాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రామన్నగూడలో సీపీఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం దోచిపెడుతోందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కార్మిక చట్టాలను, మానవ హక్కులను కాలరాస్తూ సంపన్న వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఇది దుర్మార్గం అని మండిపడ్డారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, ధరలను నియంత్రించడం లేదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేలా కార్మికులు,కర్షకులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16న జరిగే గ్రామీణబంద్‌కు సీపీఐ మద్దతు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, వివిధ యూనియన్ల నాయకులు సత్యనారాయణ, అంజయ్య, సత్తిరెడ్డి, మక్బూల్, మంజుల, శివ, కృష్ణయ్య, మల్లేశ్, బాలయ్య, రఫీ, నాగేశ్ పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన రామభక్తులు


పరిగి: అయోధ్యకు వెళ్తున్న భక్తులు

పరిగి, ఫిబ్రవరి 11: పరిగి నుంచి ఆదివారం అయోధ్యకు రామభక్తులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. పరిగి నియోజకవర్గం నుంచి దాదాపు 250మంది భక్తులు రైలులో అయోధ్యకు వెళ్లారు. భక్తుల సౌకర్యార్థం పరిగి నుంచి సికింద్రాబాద్ వరకు పరిగి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

కులకచర్ల: కులకచర్ల నుంచి అయోధ్యకు ఆదివారం బీజేపీ నాయకులు బయలుదేరి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు అయోధ్యలో బాల రాముడిని దర్శనార్థం తరలివెళ్లారు. అయోధ్యకు విడతల వారీగా బీజేపీ శ్రేణులు వెళ్తున్నారని ప్రహ్లాద్‌రావు తెలిపారు. అయోధ్యకు వెళ్లిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు షైపాల్, బీసీ మోర్చా నాయకులు వెంకటేశ్ ఉన్నారు.


కులకచర్ల: అయోధ్యకు వెళ్తున్న బీజేపీ నాయకులు

జిల్లా వాసులకు జాతీయ అవార్డులు


సంతు శ్రీసేవాలాల్ అవార్డును అందుకుంటున్న రాఘవన్ నాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 11: సంతు శ్రీ సేవలాల్ మహారాజ్ జాతీయ అవార్డును వికారాబాద్ మండలం కోటాల గూడ గ్రామానికి చెందిన అఖిల భారత గిరిజన సమాఖ్య అధ్యక్షుడు రాఘవన్ నాయక్ అందుకున్నారు. తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమి నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధాకృష్ణ, కర్ణాటక ప్రొఫెసర్ రచయిత్రి వెంకమ్మ చేతుల మీదుగా ఆదివారం అవార్డును అందుకున్నారు. అదేవిధంగా జిల్లాకు చెందిన నవాబుపేట ఎంఈవో గోపాల్, టీచర్ స్వరూప విద్యారత్న అవార్డులను పొందారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పెండ్యాల అనంతయ్య, ఉద్యమ నాయకులు ఆర్దే నాయక్, కళాకారుడు టేకు పెంటన్న పాల్గొన్నారు.

కొత్తగడి రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన ప్రజాప్రతినిధులు


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

వికారాబాద్, ఫిబ్రవరి 11: కొత్తగడి రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి వెళ్లి ఈ ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక కౌన్సిలర్ వేణు, మురళి, నాయకులు కిషన్‌నాయక్, అనంత్‌రెడ్డి, కిందొడ్డి అంజయ్య పాల్గొన్నారు.

'ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై లేదు'

ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఎలక్షన్ మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై ఎందుకు చూపించడం లేదని పీవోడబ్ల్యూజిల్లా కార్యదర్శి వై.గీత ప్రశ్నించారు. కొత్తగడి బాలికల రెసిడెన్షియల్ వసతి గృహంలో తరుచూ జరుగుతున్న ఘటనలపట్ల ఉన్నతాధికారులు స్పందించడంలేదన్నారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థిసంఘాలను, మీడియాను అనుమతించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గతంలో ఓబాలిక మరణిస్తే అనారోగ్య సమస్యలు అని చెప్పి తప్పించుకున్నారని గుర్తుచేశారు. పరీక్షల సమయంలో విద్యార్థుల అనారోగ్యం పాలవుతుంటే వారి భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించాలన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వసతి గృహంలో తనిఖీ చేయాలని ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు


ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాండూరురూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని అంతారంలో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు, గోమత పూజ, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, నాయకులు సంతప్‌కుమార్, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, భూకైలాస్ వ్యవస్థానకులు వాసుపవార్ తదితరులను కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరతామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వడ్డె చంద్రయ్య, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వడ్డె శేఖర్, ఎంపీటీసీ శాంతు పాల్గొన్నారు.

గృహజ్యోతికి లబ్ధిదారుల వివరాల సేకరణ

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 11: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి లబ్ధిదారుల నుంచి విద్యుత్ సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సిబ్బంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం లబ్ధిదారుల వివరాలను సేకరించారు. విద్యుత్ మీటర్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు నెంబరులు, ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల రశీదులు, ఫోన్ నెంబర్లను లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న హైమారెడ్డి

శామీర్‌పేట, ఫిబ్రవరి 11 : పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శి ఎస్. హైమారెడ్డి అన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్ (వర్థంతి) సందర్భంగా ఆదివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీన్‌దయాళ్ జాతీయవాది, హిందూ రాష్ట్ర సిద్ధాంతకర్త అని అన్నారు. భారతీయ జనసంఘ్ పూర్వ నాయకుడని చెప్పారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- రూ. కోట్ల ప్రజాధనం వృథా
- వినియోగించుకోవడంలో అధికారుల వైఫల్యం

యాచారం, ఫిబ్రవరి 11 : మండలంలో కోట్ల రూపాయల ప్రజాధనంతో వివిధ కార్యాలయాల కోసం నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండడం వల్ల అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనాలు వృథాగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉన్న పలు భవనాలు శిథిలావస్థకు చేరగా వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని, నిర్మాణంలో ఉండి వివిధ కారణాలతో నిలిచిపోయిన వాటిని పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోక..

గృహ నిర్మాణ శాఖ అధికారులు మండల కేంద్రంలో 7 ఏళ్ల క్రితం రూ. 10లక్షల నిధులతో హౌజింగ్ ఏఈ కార్యాలయం కోసం భవనాన్ని నిర్మించగా.. నాటి ప్రభుత్వం గృహనిర్మాణశాఖను రద్దు చేయడంతో అప్పటి నుంచి అది నిరుపయోగంగానే ఉంది. దాన్ని ఇరిగేషన్ శాఖ కార్యాలయంగా ఉపయోగించుకోవాలని అధికారులు నిర్ణయించినప్పటికీ మూత్రశాల, మరుగుదొడ్డి వసతి లేని కారణంగా వృథాగానే ఉంది. రూ. 20లక్షల నిధులతో 8 ఏళ్ల క్రితం మండల అతిథిగృహ నిర్మాణం చేపట్టారు. దాన్ని ప్రారంభించకపోవడంతో పిచ్చుకలకు స్థావరంగా మారి, ఫర్నీచర్‌పై దుమ్ముధూళీ పడి పాడవుతోంది. మరో రూ. లక్షన్నర వెచ్చిస్తే అది వినియోగంలోకి వస్తుందని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చెప్పారు. మండల సమావేశ మందిరంతో పాటు దుకాణసముదాయం నిర్మించడం కోసం 8ఏళ్ల క్రితం రూ. 10లక్షల నిధులతో పనులు చేపట్టారు. నిధులు లేకపోవడంతో స్లాబ్ దశలోనే అవి ఆగిపోయాయి. మరో రూ. 20లక్షల నిధులు కేటాయిస్తేనే అవి అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. 18 ఏళ్ల క్రితం నిర్మించిన ఇందిరా క్రాంతిపథకం కార్యాలయం మూడేళ్లుగా ఉపయోగంలో లేదు.


అసంపూర్తిగా ఉన్న సమావేశ మందిరం

యాచారం, మేడిపల్లి, చౌదర్‌పల్లి, మాల్ గ్రామాలలో రైతువేదికలున్నాయి. కానీ యాచారం మినహా మిగతావి నిరుపయోగంగా ఉన్నాయి. వీటి వల్ల 18ఏళ్ల క్రితం రూ.25లక్షలతో నిర్మించిన వ్యవసాయశాఖ భవనం నిరుపయోగంగా మారి అందులో అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థకు చేరి..

ప్రభుత్వాసుపత్రి భవనం 50ఏళ్ల క్రితం నాటిది. వర్షాకాలంలో రోగులు, వైద్యులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. దాన్ని కూల్చి కొత్త భవనం నిర్మించాలని మండల వాసులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. 1984లో రూ. 15లక్షల నిధులతో నిర్మించిన ఎస్సీ దుకాణ సముదాయం వృథాగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరింది. ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం నాటి ప్రభుత్వం దీన్ని నిర్మించింది. మేడిపల్లిలోని పశువుల ఆసుపత్రి భవనాన్ని 25 ఏళ్లక్రితం రూ. 20లక్షల వ్యయంతో నిర్మించగా శిథిలావస్థకు చేరింది. ఈ గ్రామంలోనే బీసీ బాలుర వసతి గృహాన్ని గత ప్రభుత్వ హయాంలో రూ.45 లక్షల నిధులతో నిర్మించగా అది వృథాగా ఉంది. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణలో 8 తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరు గదుల నిర్మాణం కోసం స్లాబ్ వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అవి పూర్తికావాలంటే మరో రూ.30లక్షల నిధులు కావాలని తెలిసింది. చౌదర్‌పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని 45 ఏళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం కోసం నిర్మించిన పురాతన భవనంలో కొనసాగిస్తున్నారు. అది ఏ క్షణాన కూలుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మాల్‌లో 26 ఏళ్ల క్రితం, నాటి సర్పంచులు జంగారెడ్డి, రబ్బానీ తమ స్వంత డబ్బుతో పాటు చందాలు వసూలు చేసి ఎకరంనర స్థలం కొని బస్టాండ్‌ను నిర్మించారు. ప్రస్తుతం అది వృథాగా ఉంది. 2013లో రూ.21లక్షలతో నిర్మించిన దుకాణసముదాయం కూడా నిరుపయోగంగానే ఉంది. తాటిపర్తిలో 15 ఏళ్లుగా అంగన్‌వాడీ భవనం వృథాగానే ఉంది. అది శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న ఓ ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తోంది. ఈ గ్రామంలోనే ఉన్న పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేపిస్తే అది అందుబాటులోకి వస్తుందని రైతులు చెప్పారు. ఇక్కడి స్మశాన వాటిక ముందే పాఠశాల ఉంది. విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలను మరో చోట నిర్మించడానికి పదేళ్ల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థల పరిశీలన చేసినా పనులు ముందుకు సాగలేదు. పలు తరగతి గదులు, వంటశాల శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే మధ్యాహ్న భోజనం వండే వారు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం

భవనాలను పూర్తి చేయిస్తా



అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేయించడం కోసం జిల్లా పరిషత్ అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు కోసం కృషి చేస్తా. ఎస్సీ దుకాణ సముదాయ షటర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరుతా. నిర్మాణంలో ఆగిపోయిన వాటిని పూర్తి చేయిస్తా.

- కొప్పు సుకన్యబాషా, ఎంపీపీ, యాచారం

పాఠశాలకు భవనాలు నిర్మించాలి



గ్రామంలోని పాఠశాల గదులన్నీ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మరో చోట కొత్తగా భవనాలు నిర్మించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. పాఠశాల ముందే స్మశాన వాటిక ఉన్న కారణంగా ఒక్కోసారి వాసన భరించలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- దూస రమేష్, మాజీ సర్పంచ్ తాటిపర్తి

కొడంగల్‌కు నిధుల వరద

- మెడికల్ కళాశాలకు రూ.124.50 కోట్లు
- నర్సింగ్ కళాశాలకు రూ.46 కోట్లు
- ఫిజియోథెరపి, పారామెడికల్ కళాశాలలకు రూ.27 కోట్లు
- మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పరిధిలోకి సీహెచ్‌సీని తీసుకు వస్తూ ఉత్తర్వులు
- దౌల్తాబాద్, బొంరాస్‌పేట్లో జూనియర్ కళాశాలలు

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ముఖ్యమంత్రి .రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజక వర్గానికి భారీగా నిధుల వరద ప్రవహిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలల ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ కోసం రూ.224.50 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా పరమైన అనుమతులు జారీ చేసింది. కొడంగల్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు రూ.124.50 కోట్లు మంజూరు చేయగా, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు రూ.46 కోట్లు, ప్రభుత్వ ఫిజియోథెరపి, పారా మెడికల్ కళాశాలకు రూ.27 కోట్లు, 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 220 పడకలతో టీచింగ్ హాస్పిటల్‌గా స్థాయి పెంపొందించేందుకు రూ.27 కోట్లు మంజూరు చేస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కళాశాలలో ప్రతిఏటా 50 సీట్లను పెంచనున్నారు. నర్సింగ్ కళాశాలలో ప్రతిఏటా 60, ఫిజియోథెరపి కళాశాలలో 50, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలలో 30 సీట్లు పెరగనున్నాయి. కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా సీహెచ్‌సీని 220 పడకలతో టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయబోతున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆధీనంలో ఉన్న సీహెచ్‌సీని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పరిధిలోకి తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలల భవనాల నిర్మాణం పనులను ఆర్అండ్‌బీ శాఖ చేపట్టనుండగా, సీహెచ్‌సీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసే పనులను టీఎస్ఎంఎస్ఐడీసీ చేపట్టనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొడంగల్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలలు ప్రారంభమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

కొడంగల్ నియోజకవర్గంలో ఈ గతేడాది ప్రారంభమైన దౌల్తాబాద్, కొత్తగా మంజూరైన బొంరాస్‌పేట జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బొంరాస్‌పేట, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.7.13 కోట్లు మంజూరు చేయగా, ఒక్కో కళాశాల భవన నిర్మాణానికి రూ.4.79 కోట్లు, రూ.2.34 కోట్లు కేటాయించింది. ఈ కళాశాలల భవన నిర్మాణం కోసం అనువైన చోట స్థల సేకరణ చేపట్టాలని విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

నిలిపి ఉన్న కారును ఢీకొన్న మరో కారు

- రెండు కార్లూ బోల్తా.. ● నలుగురికి గాయాలు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద ఘటన

శంషాబాద్, ఫిబ్రవరి 11 : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఓ కారును వెనక నుంచి వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లూ బోల్తాకొట్టాయి. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటకు చెందిన రాజు తన కారులో ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. ఎయిర్‌పోర్టుకు సమీపంలో రోడ్డు పక్కన తన కారును నిలిపాడు. ఇంతలో వెనుకనుంచి వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి రాజు కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు బోల్తా కొట్టాయి. రాజు, నిలిపి ఉన్న కారులోని మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో బోల్తా పడ్డ కారు

'బీసీలపై కవితది కపట ప్రేమ'

తాండూరు, ఫిబ్రవరి 11: బీసీలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కపట ప్రేమ చూపుతున్నారని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని బీసీలు ఇప్పుడెందుకు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. అప్పుడు అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో బీసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. బీసీల గళాన్ని విడిపించేందుకు ఆందోళనలు చేపడితే తమ హక్కులకు భంగం కలిగించారని చెప్పారు. ప్రజల హక్కులకు భంగం కలిగించిన ధర్నా చౌక్‌లో నేడు (12న) ఆమె బీసీల ధర్నా చేస్తాననడం విడ్డూరమని అన్నారు. రాజ్యాధికారం కోసం ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో తాము పోరాడుతామని చెప్పారు. ఈ ధర్నాని తాము బహిష్కరిస్తున్నామని తెలిపారు.

ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం


యాత్రికులకు స్వాగతం పలుకుతున్న కుటుంబసభ్యులు

శంషాబాద్, ఫిబ్రవరి 11 : ఉమ్రాయాత్ర ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన యాత్రికులకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం వారి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. తమ యాత్ర 13 రోజుల పాటు విజయవంతంగా జరిగిందని పలు పుణ్య స్థలాలను దర్శించుకున్నామని ఉమ్రా యాత్ర కన్వీనర్ మహ్మద్ ఫయాజ్ అలీ తెలిపారు.

కరాటేతో విద్యార్థులకు ఆత్మరక్షణ


విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న కృష్ణంరాజు

కొడంగల్, ఫిబ్రవరి 11 : కరాటే శిక్షణ విద్యార్థుల ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు అన్నారు. సన్ బుడోకాన్ కరాటే శిక్షణ పొందిన 40 మంది విద్యార్థులకు ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో సర్టిఫికేట్‌లు అందించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేందుకు కరాటే లాంటి సెల్ఫ్‌డిఫెన్స్ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. కరాటే మాస్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

- జన్ సాహస్ మండల కో ఆర్డినేటర్ రవీందర్


లేబర్ కార్డులను పంపిణీ చేస్తున్న జన్ సాహస్ ప్రతినిధులు

కులకచర్ల, ఫిబ్రవరి 11 : లేబర్ కార్డులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జన్‌సాహస్ మండల కో ఆర్డినేటర్ రవీందర్ అన్నారు. ఆదివారం కులకచర్లలోని బస్టాండ్ దగ్గర జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ, సీఎస్‌సీ లేబర్ శాఖ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులందరూ లేబర్ కార్డులను పొంది ఇన్సూరెన్స్, వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేబర్ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. లేబర్ కార్డు కలిగిన కార్మికుడి ఇంట్లో కూతుళ్లు ఉంటే వారి పెళ్లిలకు ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారని అన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షల 30వేలు, సహజ మరణానికి రూ.1 లక్ష 30వేలు, ప్రమాదంలో అంగవైకల్యం చెందితే రూ.5లక్షలు కార్మిక శాఖ ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కుర్ వెంకటేశ్, హెల్త్ క్యాంపు కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్, వెంకటేశ్, శిరీష, నరేందర్, నరేశ్, జయసుధ, అనిల్, రాజేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాతకు పూజలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని పచ్చతోరణాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆర్యవైశ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించారు. ఆమనగల్లుతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వాసవి నామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారికి మేల్కొలుపు పాడారు. అనంతరం వాసవి మాత మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో అలంకరించి అర్చకుడు శ్రీనయ్య, దినేశ్ ఆధ్వర్యంలో అభిషేకం, సామూహిక కుంకుమార్చన, అమ్మవారి యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ కోశాధికారి బికుమళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బికుమళ్ల నర్సింహ, నాయకులు మాండెం చంద్రశేఖర్, నీలం యాదయ్య, కుమార స్వామి, దొంతు సత్యనారాయణ, నర్సింహ్మా, విజయ్, జగన్, వాస శ్రీనివాస్, రవీంద్రానంద్, ఆకుతోట శ్రీనివాస్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : హోమం నిర్వహిస్తున్న మహిళలు

యాచారం : యాచారం మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘ నాయకులు వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలువురు నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరీ మార్గంలో ముందుకు సాగుతామని అన్నారు. మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు వి. సంతోష్, నరేష్, సురేందర్, శివశంకర్, వెంకటరత్నం, ప్రవీణ్, కిరణ్, విజేందర్ ఉన్నారు.


యాచారం : పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



స్పీకర్ ప్రసాద్‌కుమార్ నుంచి పురస్కారం అందుకుంటున్న శంకర్ నాయక్

శంకర్ నాయక్‌కు జాతీయ స్థాయి సేవా పురస్కారం

కడ్తాల్, ఫిబ్రవరి 11 : సామాజిక సేవా కార్యక్రమాల్లో కడ్తాల మండలం గాన్గుమర్ల తండాకు చెందిన బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాణావత్ శంకర్ నాయక్ జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. తారా ఆర్ట్స్ అకాడమీ ప్రతీయేటా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి అఖిల భారత శాస్త్రీయ జానపద కళోత్సవంలో భాగంగా జాతీయ స్థాయి సేవా పురస్కారాలు ప్రదానం అందజేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తారా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు సంకే రాజేశ్‌లతో కలిసి శంకర్‌నాయక్‌కు స్పీకర్ అవార్డు ప్రదానం చేశారు. శంకర్ నాయక్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు. రాజేశ్, మురళి, జర్పుల లక్ష్మణ్‌నాయక్, నవీన్‌నాయక్, రమేశ్‌నాయక్, తదితరులున్నారు.

మంచాల పీఏసీఎస్ చైర్మన్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందిస్తున్న ప్రతినిధులు

మంచాల, ఫిబ్రవరి 11 : మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ యాదయ్యకు అరుదైన పురస్కారం లభించింది. పలు రంగాల్లో ఆయన అందించిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్ వరించింది. మంచాల మండలం చీదేడ్ గ్రామానికి చెందిన బొద్రమోని యాదయ్య ప్రస్తుతం మంచాల పీఏసీఎస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆయన్ను తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫ్రెండ్షిప్ మినిస్ట్రీ హానరర్ డాక్టరేట్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం నగరంలో నిర్వహించారు. ఇందులో భాగంగా సాహిత్య, కళా, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత కొలకలూరి ఇనాక్, శతచిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, మాజీ పార్లమెంటు సభ్యుడు ఎస్.వేణుగోపాలచారిల యాదయ్యకు డాక్టరేట్ అందచేశారు. ఈ సందర్భంగా యాదయ్య ఆనందం వ్యక్తం చేశారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

తలకొండపల్లి, ఫిబ్రవరి 11: కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నేడు(సోమవారం) ఉదయం 10 గంటలకు కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాల్‌రాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కృష్ణాజలాల పరిరక్షణకు 13న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభ విజయవంతం, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలపై చర్చించడం జరుగుతుందని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అదేవిధంగా ఇటీవల పదవీ కాలం పూర్తిచేసుకున్న పంచాయతీ పాలకవర్గాలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, మాడ్గుల, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

కొత్తూర్, ఫిబ్రవరి 11: వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తూ వ్యాపారాభివృద్ధి చేసుకోవాలన్నారు. కొత్తూర్ మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, మాజీ సర్పంచులు సుదర్శన్‌గౌడ్, గంగ్రాతి బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

యాచారం, ఫిబ్రవరి 11 : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం నిధులు విడుదల చేశారు. తాటిపర్తికి రూ.41లక్షలు, మాల్‌కు రూ.35లక్షలు, నల్లవెల్లికి రూ.20లక్షలు, అయ్యవారిగూడకు రూ.25లక్షల నిధులు కేటాయించారు. ఈమేరకు ప్రొసీడింగ్‌లను ఆయన నివాసంలో అందించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని, లేనియెడల అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రంగారెడ్డి హెచ్చరించారు. మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన వారిలో నల్లవెల్లి ఎంపీటీసీ ఇ.లక్ష్మీపతిగౌడ్, నాయకులు వి.తిరుమలేష్, లచ్చిరాంనాయక్, ఎం.సంపత్ తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

కందుకూరు, ఫిబ్రవరి 11 : మండల కేంద్రానికి చెందిన భానుచందర్ ఇటీవల మరణించాడు. అతడి కుటుంబానికి స్నేహితులు ఆర్థికసాయం అందించేందుకు ముందుకొచ్చారు. 2008-09 పదో తరగతి స్నేహితులు ఆదివారం కుటుంబ సభ్యులను కలిసి రూ.50వేల నగదు అందించారు. భానుచందర్ మరణం తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.



పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- తుమ్మలూరు-మహేశ్వరం ప్రధాన రహదారి పనులను పరిశీలన

మహేశ్వరం, ఫిబ్రవరి 11 : మహేశ్వరం నియోజకవర్గంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేసేలా చొరవ తీసుకోవాలని కాంట్రాక్టర్లు, అధికారులకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. ముఖ్యంగా తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని ఆయన తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలూరు-మహేశ్వరం ప్రధాన రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులు ఏవైనా సరే నిర్మాణంలో ఉండి అసంపూర్తి ఉన్నవాటిని వెంటనే పూర్తిచేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి అసంపూర్తి పనులకు మరిన్ని నిధులను విడుదల చేయాలని కోరనున్నట్లు తెలిపారు. తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లతో మాట్లాడుతానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు జంగారెడ్డి, ఆమనగంటి ప్రశాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, డేనియల్, కొండల్‌రెడ్డి, రాజునాయక్, యాదగిరి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కేఎల్లార్

మురుగు.. పరుగు

- హిమాయత్ నగర్ రోడ్డుపై డ్రైనేజీ నీరు.. పట్టించుకోని అధికారులు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని హిమాయత్ నగర్ ప్రధాన రోడ్డుపై మురుగు పరుగు తీస్తోంది. గ్రామంలోని సాయిబాబా ఆలయం ముందు నుంచి పెద్దఎత్తున మురుగు ప్రవహిస్తోంది. నెల రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లడంతో రహదారిపై మురుగు పారుతోంది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడం లేదు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో గ్రామస్తులతో పాటు భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. దుర్వాసనతో పాటు రహదారిపై నడిచే పాదచారులకు ఇబ్బందిగా మారింది. గతంలో నిర్మించిన అండర్‌డ్రైనేజ్ కాలువల్లోని మురుగు సమీపంలోని కుమ్మరి కుంటలోకి వచ్చే విధంగా నిర్మించారు. అయితే, అండర్‌డ్రైనేజ్ మురుగు కాలువల్లో కొందరు రాళ్లను వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో నీరు కుంటలోకి వెళ్లకుండా డ్రైనేజీ పొంగి మురుగు రోడ్డుపై పారుతోంది. గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం పూర్తవడంతో తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయడం లేదని, ప్రత్యేకాధికారుల పాలనలోనైనా సమస్యను పరిష్కరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హిమాయత్ నగర్‌లో ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగు

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



ముద్విన్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీ

కడ్తాల్, ఫిబ్రవరి 11: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా కడ్తాల మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరైనట్లు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. మండల పరిధిలోని మైసిగండిలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.8లక్షలు, ఈజీఎస్ నిధుల నుంచి ముద్విన్‌లో రూ.15 లక్షలు, ఎక్వాయిపల్లిలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎంపీపీ ఆదివారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈజీఎస్ నిధుల నుంచి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30లక్షలు, మైసిగండికి రూ.30లక్షలు, ముద్విన్‌కు రూ.15లక్షలు, ఎక్వాయిపల్లికి రూ.20 లక్షలు, చరికొండకు రూ.15 లక్షలు, పల్లెచెలుక తండాకు రూ.10 లక్షలు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, గిరిజన తండాలలో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందని ఎంపీపీ చెప్పారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీలు ఉమావతి, నిర్మల కాశీనాథ్‌రెడ్డి, రాములు, మాజీ సర్పంచ్‌లు సుగుణ సాయిలు, తులసీరామ్‌నాయక్, యాదయ్య, నాయకులు శంకర్, సాయిలు, మధు, నర్సింహ, నారాయణ రెడ్డి, సత్యనారాయణ, రమేశ్, సురేశ్, మనీశ్‌రెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



యాచారం, ఫిబ్రవరి 11 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐగా జి.నాగరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఆయన రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని స్పెషల్ బ్రాంచ్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో నాగరాజు కందుకూరు ఎస్సైగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సీఐ ఎల్.రామాంజనేయులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు.

14 నుంచి శ్యామలాదేవి నవరాత్రోత్సవాలు

యాచారం, ఫిబ్రవరి 11 : మండలంలోని నందివనపర్తిలోని జ్ఞానసరస్వతీ ఆలయంలో ఈ నెల 14 నుంచి శ్యామలాదేవి నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలను హంపివిరూపాక్ష విద్యారణ్యభారతి స్వామీజీ చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొనాలని వారు కోరారు.

పేద కుటుంబానికి చేయూత

- సొంత డబ్బుతో ఇంటి నిర్మాణం

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11 : గూడులేని నిరుపేద కుటుంబానికి సొంత డబ్బుతో ఇంటి నిర్మాణం చేసి గృహప్రవేశం చేయించాడు ఓ దాత. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లికి చెందిన బుడగ జంగం లక్ష్మీ మల్లేష్ కడు పేదవారు. పురాతన ఇల్లు శిథిలావస్థకు చేరడంతో అందులో ఉండేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కుర్వ మల్లేష్ ఇంటిని యంత్రాలతో కూల్చివేయించి అదే స్థలంలో సుమారు రూ.6లక్షలతో కొత్త ఇంటిని నిర్మించారు. ఆదివారం పూజలు చేసి గృహప్రవేశం చేయించారు. తమకు గూడు కట్టించి నీడ కల్పించిన మల్లేష్‌కు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



మల్లేష్ దంపతులతో గృహప్రవేశం చేయిస్తున్న మల్లేష్ యాదవ్

జ్ఞానంతోనే చైతన్యం

ఆమనగల్లు, ఫిబ్రవరి 11: జ్ఞానంతోనే సమాజ చైతన్యం సాధ్యమని బహుజన సంఘాల జేఏపీ కన్వీనర్ కంబాలపల్లి అల్లాజీ అన్నారు. జ్ఞాన సమాజ నిర్మాణం దిశగా బహుజనులంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం అంబేడ్కర్ జ్ఞాన ప్రచారసభ ఆధ్వర్యంలో మహనీయుల జీవిత చరిత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా చైతన్యంతోనే సమాజాభివృద్ధి ఆశించిన రీతిలో సాధ్యపడుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా అంబేడ్కర్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని ఆయన తెలిపారు. సమాజంలో లక్ష్యాన్ని సాధించాలంటే జ్ఞానం అవసరమని, అది కేవలం విద్య ద్వారానే సాధ్యమని అల్లాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతుక శంకర్, మీసాల రమేశ్,, జంతుక గిరి, కాలే విక్రమ్, కంబాలపల్లి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి సాయమ్మ ఇటీవల మృతి చెందింది. ఈమేరకు మృతురాలి కుటుంబాన్ని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమకూర్చిన రూ.5వేలు బాధిత కుటుంబానికి దశరథ్ నాయక్ అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు వీరయ్య, జంగయ్య, పాండు, తదితరులు ఉన్నారు.

విపక్షాలది అవకాశవాద రాజకీయం



మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల్లో ఉనికి కోసం విపక్షాలు అవకాశవాద రాజకీయాలు సాగిస్తున్నాయని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలకు మరింత చెరువైందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోల్పోయామన్న అక్కసుతో రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకలు కుట్ర రాజకీయాలకు, విషప్రచారాలకు తెరలేపారన్నారు. ప్రాజెక్ట్‌ల నిర్మాణం, అభివృద్ధి పనులు, పథకాల అమలులో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వంవిచారణ కు ఆదేశిస్తే తమ బండారం ఎక్కడ బయట పడుతుందోనని బీఆర్ఎస్ నాయకులు భయంతో ప్రభుత్వంపై ఎదురు దాడికి దిగుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఆ పార్టీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకొని దాచుకున్నారని ఆరోపించారు. గాడి తప్పిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దారిలోపెట్టి తెలంగాణ పునర్నిర్మాణం దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలకు బాటలు వేస్తున్నాయన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షదాయకమన్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డిపై బీజేపీ నాయకుల అసత్య ప్రచారాలు వీడకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీక్యనాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు రాంచందర్, యాదయ్యగౌడ్, మంకి శ్రీను, రాజేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి : సబితారెడ్డి

కందుకూరు. ఫిబ్రవరి 11 : వైద్యులు మారుమూల గ్రామాలకు వెళ్లి పేదలకు ఉచిత, మెరుగైన వైద్యసేవలు అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని గుడూరు చౌరస్తా వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీర్‌ఖాన్‌పేట సమీపంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించి పేదలను ఆదుకోవాలని కోరారు. ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సురేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, ఇందిర తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ బూత్‌లెవల్ కమిటీ

కందుకూరు, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ పార్టీ కందుకూరు మండల బూత్‌లెవల్ కమిటీని ఆదివారం నియమిస్తూ ఆ పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి నియామక పత్రాలు అందించారు. కమిటీ అధ్యక్షుడిగా బొక్క భూపాల్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల బూత్‌లెవల్ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, ఖలీల్, నరేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూపాల్‌రెడ్డికి నియామక పత్రం ఇస్తున్న జంగారెడ్డి

న్యాయ్ యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ్ యాత్రలో ఆదివారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి కొత్తూరు మండలంలో పాలమూరు న్యాయ్ యాత్రలో పాల్గొని వంశీచంద్‌రెడ్డికి సంఘీబావం ప్రకటించారు. వంశీ, కసిరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లతో కలిసి వారు పాదయాత్రలో పాల్గొన్నారు. వంశీచంద్ రెడ్డి చేపట్టిన న్యాయ్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందిస్తుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాదించి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, నాయకులు మిట్టపల్లి అంజయ్య, కడ్తాల మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు హీరాసింగ్, తులసీరామ్ నాయక్, వెంకట్‌రెడ్డి, అజీమ్, రవీందర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



చల్లా వంశీచంద్ రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఆమనగల్లు మండలం వేములకుంట తండాకు చెందిన చంద్రు, బుజ్జిలు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వైపు నుంచి బైక్‌పై వచ్చి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవు, లేగదూడలు స్వాధీనం

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : అనుమతులు లేకుండా ట్రాలీ ఆటోలో తరలిస్తున్న ఓ ఆవు, రెండు లేగదూడలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై బాల్‌రామ్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం ఏఎస్ఐ యాదయ్య సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వైపు పరదా కప్పుకొని వెళ్తున్న ఆటో ట్రాలీని ఆపి తనిఖీలు చేశారు. అందులో అనుమతులు లేకుండా ఆవు, రెండు లేగదూడలను తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం ఆవు, దూడలను, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ రవి, ఆటో యజమాని అబ్దుల్ మతిన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమిలోకి అక్రమంగా చొరబాటు.. పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

శంషాబాద్, ఫిబ్రవరి 11 : శంషాబాద్ మండలం రాయన్నగూడ సమీపంలోని సర్వే నెంబర్ 11లో జనార్ధన్‌రెడ్డి అనే వ్యక్తికి 22 గుంటల భూమి ఉంది. కాగా, ఈ భూమిపై కోర్టులో వివాదం నడుస్తోంది. ఈక్రమంలో తాళ్ల రాములుగౌడ్ అనే వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తనతో గొడవపడ్డారని జనార్ధన్‌రెడ్డి శంషాబాద్ రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 11 : క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి అన్నారు. ఆదివారం దెబ్బడగూడలో డీపీఎల్ సీజన్-1 క్రికెట్, వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యువత గ్రామాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ మహమూద్ అలీ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిట్ల రాజేందర్‌రెడ్డి, నాయకులు విఘ్నేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గృహజ్యోతి' వివరాల సేకరణ

చౌదరిగూడ, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం అమలుకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు ఏఈ రవికుమార్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట, వనంపల్లి, చౌదరిగూడ, పద్మారం, పెద్దఎల్కిచర్ల, వీరన్నపేట్, గ్రామాల్లో గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల సేకరణలో అధికారులు బిజీబిజీగా ఉన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకం అమలు కోసం అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫోన్‌నెంబర్ తదితర వివరాలు అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులందరికీ అందించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని వెంకట్రావ్ పేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ విశ్వాస్ ఆసుపత్రి సహకారంతో కాంగ్రెస్ సేవాదళ్ మండలాధ్యక్షుడు కానుగుల దశరథం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. నాయకులు కానుగుల వెంకటయ్య, శివశంకర్, మహేశ్,శ్రీకాంత్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న వరప్రసాద్

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయమని డీసీసీ ఉపాధ్యక్షుడు, ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ తొలి బడ్జెట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి పునాది వేసేలా ఉందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకనుగుణంగా ఆరు గ్యారంటీ పథకాల అమలుకు రూ.53,981 కోట్లు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మండలానికో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వ సాహసోపేత నిర్ణయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బడ్జెట్‌లో రూ.7,740 కోట్లు కేటాయింపు, ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసానిచ్చేలా వైద్యరంగానికి రూ.11,500 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీల సంక్షేమానికి కూడ బడ్జెట్‌లో పెద్ద పీట వేయడం జరిగిందని వరప్రసాద్‌రెడ్డి వివరించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. నాయకులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండ్లీ రాములు, చంద్రశేఖర్, అభినవ్ రెడ్డి, పంతూనాయక్, రమేశ్, లక్ష్మణ్, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించే బడ్జెట్

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మోసగించే బడ్జెట్‌లా ఉందని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు మరిచిపోయి బడ్జెట్ ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ఆరోపించారు. పట్టణంలోని ఏటీ కాంప్లెక్స్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లడుతూ బడ్జెట్ ఘోరంగా ఉందన్నారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలకు రూ.5లక్షల కోట్లు కేటాయించాలని, అందులో వడ్డీలేని పంట రుణాల ప్రస్తావన లేదని తెలిపారు. విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పారని, విద్యా భరోసా ఊసేలేదన్నారు. ఉద్యమకారులకు నెలకు రూ.25వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ బడ్జెట్‌లో ప్రస్తావన తీసుకురాలేదని విచారం వ్యక్తం చేశారు. 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పినట్లు గుర్తుచేశారు. నిరుద్యోగుల భృతి గూర్చి బడ్జెట్‌లో చెప్పలే దన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, వెంకటేష్ గుప్త, మణికంఠ, నర్సింలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న శాంతకుమార్